# చెరువు కట్టలు భద్రమేనా?

- బలమైన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయంటున్న అధికారులు
- చెరువు కట్టలపై విస్తరించిన ముళ్ల పొదలు
- శిథిలాలతో పూడిపోయిన చెరువు కాలువలు


పోతుకుంట చెరువు వద్ద శిథిలాలతో పూడిపోయిన చెరువు కాలువ

**ధర్మవరం రూరల్:** రానున్న ఐదు రోజుల పాటు జిల్లాలో బలమైన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటనలు చేస్తున్నారు. అయితే ధర్మవరం నియోజకవర్గంలో చాలా చెరువు కట్టలపై విస్తారంగా ముళ్ల చెట్లు విస్తరించి ఉన్నాయి. ముళ్ల పొదలతో చెరువు కట్టలు నెర్రెలు బారే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఒకవేళ బలమైన వర్షాలు కురిసి చెరువులు మరువలు పారితే నీటి ఉధృతి కారణంగా చెరువు కట్టలు భద్రంగా వుంటాయా? అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చెరువు కట్టల భద్రతపై జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించి చెరువు కట్టల భద్రతపై చర్చించారు. ఈ సమావేశంలో బలహీనంగా వున్న చెరువు కట్టలను గుర్తించి వాటిని సరిచేసే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలను జారీ చేసిన విషయం విదితమే.

### మరమ్మతులు ఎప్పుడు చేస్తారు?

ధర్మవరం నియోజకవర్గంలో బలహీనంగా ఉన్న చెరువు కట్టల మరమ్మతు, కట్టలపై ముళ్ల పొదలను తొలగించడం, చెరువు కాలువలు పూడిక తీత తదితర వాటి కోసం ప్రభుత్వం ధర్మవరం నియోజకవర్గానికి రూ.90 లక్షలను మంజూరు చేసింది. అయితే ఈ పనులు వేసవి కాలంలోనే పూర్తి చేసి ఉంటే బాగుండేదని రైతులు అంటున్నారు. ఉన్న ఫలంగా చెరువులు నిండితే చెరువు కాలువలను మరమ్మతులు చేయడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారంటున్నారు. అదే విధంగా పైర్లు పోసుకోవడానికి కాలువల ద్వారా నీటిని సరఫరా చేయడం కుదరదని చెబుతున్నారు. గతేడాది ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో విస్తారంగా వర్షాలు కురవడంతో కనగానపల్లి చెరువు కట్ట తెగిన విషయం అందరికి తెలిసిన విషయమే. నిధుల కొరతతో ఆ చెరువు నేటికి మరమ్మతుకు నోచుకోలేదు. ప్రస్తుతం వర్షాలు కురిస్తే చెరువులో చుక్కనీరు కూడా నిల్వ ఉండదని కనగానపల్లి రైతులు చెబుతున్నారు.


ముళ్ల పొదలతో నిండిన కట్టకిందపల్లి చెరువు

ధర్మవరం మండలంలో చెరువులు, వాటి విస్తీర్ణం, నీటి నిల్వ సామర్థ్యం

| చెరువు | సామర్థ్యం (క్యూబిక్ మీటర్లలో) | నీటి నిలువ (టీఎంసీల్లో) | ఆయకట్టు విస్తీర్ణం (ఎకరాల్లో |
|---|---|---|---|
| ధర్మవరం | 370.30 | .373 | 1922 |
| గొట్లూరుచెరువు | 90.20 | 0.90 | 542 |
| రావులచెరువు | 48.44 | 0.48 | 488 |
| రేగాటిపల్లి | 40.45 | 0.40 | 135 |
| పోతుకుంట | 13.98 | 0.13 | 218 |
| అప్రాచెరువు | 84.28 | 0.84 | 375 |


బలహీనంగా పోతుకుంట చెరువు మరువ

## హంద్రీ-నీవా కాలువపై బ్రిడ్జి నిర్మించాలి


హంద్రీ-నీవా కాలువపై బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్న మబ్బువారిపల్లి రైతులు

**తనకల్లు:** హంద్రీ-నీవా కాలువపై బ్రిడ్జిని నిర్మించాలని మబ్బువారిపల్లికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామం సమీపంలోని హంద్రీ-నీవా కాలువ వద్ద గురువారం వారు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం సమీపంలోని హంద్రీ-నీవా కాలువ కారణంగా తాము పొలాలకు వెళ్లడానికి దారి లేక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పొలాలకు వెళ్లే మార్గంలో ఉన్న హంద్రీ-నీవా కాలువపై బ్రిడ్జి లేదా కల్వర్టును నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా సంబంధిత అధికారులకు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో పొలాలకు వెళ్లాలంటే డీటీ పల్లి లేదా కొక్కంటిక్రాస్ పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి అక్కడి నుంచి పొలాలకు పోవాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామం దగ్గర ఉన్న హంద్రీ-కాలువపై బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఐక్యతతోనే కార్మిక సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు

**తాడిమర్రి:** ఐక్యతతోనే కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ రాష్ట్ర నేత ఓబులు పేర్కొన్నారు. స్థానిక వీరభద్రయ్యస్వామి ఆలయం పక్కన ఎర్రజెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి తాగునీటి కార్మికులు, ఆటో డ్రైవర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశావర్కర్లు, హమాలీలు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు తదితర కార్మికులు అందరు ఐకమత్యంగా ఉండాలన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. అలాగే కార్మికుల హక్కులకు విఘాతం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అసంఘటిత కార్మికులందరికీ ఈఎస్‌ఐ అమలు చేయాలన్నారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ పీ.నారాయణ, మహేశ్వర్‌రెడ్డి, జయలక్ష్మీ, అలివేలమ్మ, భారతి, నాగలక్ష్మీ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ


విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభిస్తున్న అధికారులు

**బత్తలపల్లి:** మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో పలువురు రైతులకు కే-6 విత్తన కాయలను వ్యవసాయశాఖ అధికారులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ ఓబిరెడ్డి మాట్లాడుతూ 30 కేజీల బస్తా రూ.1,674 సబ్సిడీ ధరతో పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం తీసుకువెళ్లి ఆయా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మండలానికి 1,500 క్వింటాళ్లు విత్తన వేరుశనగ కేటాయించగా ఇప్పటికే 1,000 క్వింటాళ్లు విత్తన వేరుశనగ ఆయా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఎంపీఈఓలు హరిప్రియ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

**తాడిమర్రి:** మండలంలోని పలు రైతు సేవా కేంద్రాల్లో గురువారం వ్యవసాయ అధికారులు విత్తన వేరుశనగ పంపిణీ నిర్వహించారు. తాడిమర్రిలోని రైతు సేవా కేంద్రంలో కూటమి పార్టీల నాయకులతో కలసి వ్యవసాయ సిబ్బంది రైతులకు విత్తన వేరుశనగ అందజేశారు. మొదటి రోజు 850 మంది రైతులకు 600 క్వింటాళ్ల విత్తనం పంపిణీ చేసినట్లు తాడిమర్రి వీహెచ్‌ఏ గౌతమి తెలిపారు.

## వందనం కాదు.. వంచన పథకం


మాట్లాడుతున్న పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర

**ధర్మవరం రూరల్:** కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయకుండా దాన్ని తల్లికి వంచన పథకంగా మార్చిందని పీఎస్‌యు(ప్రగతిశీల విద్యార్థి సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర ఆరోపించారు. గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అంటూ నాడు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టి నేడు రూ.13 వేలతో సరిపెట్టిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల సంఖ్య 87 లక్షలకు పైగా ఉన్నట్లు వెబ్ సైట్‌లో గణాంకాలు చెబుతున్నాయన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం కేవలం 67 లక్షల మందికి విద్యార్థులకు కేవలం రూ.8,745 కోట్లు విడుదల చేస్తామనడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యూడైస్ కోడ్ చూపుతున్న అధికారిక లెక్కల ప్రకారంరాష్ట్రంలో ఇంకా 20 లక్షలకుపైగా విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు లెక్కల వల్ల అర్హత ఉండి కూడా అర్హతను కోల్పోతున్న మిగిలిన 20 లక్షల మంది విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు భాస్కర్, మునేంద్ర, సతీష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ రాధిక

**కదిరి టౌన్:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తామని సీడీపీఓ రాధిక తెలిపారు. గురువారం కుటాగుళ్ల అంగన్‌వాడీ కేంద్రం-2లో అక్షరాభ్యాసం, అంగన్‌వాడి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించడంతోపాటు పూర్వ ప్రాథమిక విద్యనందిస్తామన్నారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మి, మమత, ఇందిరా, అంగన్‌వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, లక్ష్మి, సుజాత, శాంతి తదితరులు పాల్గొన్నారు.

### గొర్రెలు, మేకలకు ఉచిత వ్యాధి నిరోధక టీకాలు

**హిందూపురం:** ప్రస్తుత సీజన్‌లో నీలి నాలుక వ్యాధి నివారణకు ఉచిత వ్యాధి నిరోధక టీకాలు వేయడంతోపాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పశు వైద్య సహాయకులు డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం తెలిపారు. గురువారం మండలంలోని బేవనహళ్లి రైతు సేవా కేంద్రంలో సన్నజీవాల పెంపకం-నీలి నాలుక వ్యాధి నివారణ టీకాల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. నీలి నాలుక వ్యాధి గొర్రెల్లో ఎక్కువగా కనిపిస్తుందన్నారు. కొన్ని సందర్భాల్లో మేకలతో పాటు ఇతర పశువులను కూడా ఇది ప్రభావితం చేస్తుందన్నారు. ఒకసారి వ్యాక్సిన్ ఇచ్చిన పశువుకు ఏడాది వరకు రక్షణ ఉంటుందన్నారు. అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక రైతు సేవా కేంద్రం పశువైద్యులను సంప్రదించాలన్నారు.

### మురళీనాయక్ కుటుంబానికి పరామర్శ


మురళీనాయక్ తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

**గోరంట్ల:** ఆపరేషన్ సిందూరులో అశువులు బాసిన వీర జవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని కర్నూలు జిల్లా ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జవాన్ తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జోతిబాయిలను ఓదార్చారు. వారికి సాయిప్రసాద్‌రెడ్డి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మురళీనాయక్ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్రనాథరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులందరికీ పథకం వర్తింపజేయాలి

**పుట్టపర్తి టౌన్:** సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని రాష్ట్రంలోని అర్హులైన విద్యార్థులందరికీ వర్తింపజేయాలని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఇడువబత్తిని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 87.41 లక్షల మంది విద్యార్థులున్నారని వెబ్‌సైట్ గణాంకాలు చెబుతున్నాయని, కానీ రాష్ట్ర ప్రభుత్వం 67 లక్షల మంది విద్యార్థులకు మాత్రమే నిధులు విడుదల చేయడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వం చర్య పేద విద్యార్థులకు అన్యాయం చేయడమేనని తెలిపారు.

## మురుగు గుంత.. అంగన్‌వాడీ కేంద్రం చెంత


ఎనుములపల్లి అంగన్‌వాడీ కేంద్రం పక్కన ఉన్న మురుగునీరు

**పుట్టపర్తి అర్బన్:** జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద అపరిశుభ్రత నెలకొని ఉండడంతో నిత్యం చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని ఎనుములపల్లి అంగన్‌వాడీ కేంద్రం భవనానికి ఇరువైపులా మురుగు నిలబడుతోందని ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఎనుములపల్లి కాలనీ, చర్చి వైపు కాలనీ గ్రామంలోని పలు వీధుల నుంచి వచ్చే మురుగునీరు అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిలబడి దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. సదరు రహదారులపై వాహనాలు వెళ్లినా కేంద్రంలోకి ఎగిరిపడుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేంద్రం ఇరువైపులా ఉన్న మురుగును తొలగించాలని కోరుతున్నారు.

## ప్రభుత్వ భవనం.. నిర్వహణ లేక శిథిలం


కనగానపల్లిలో నిరుపయోగంగా ఉన్న ఇరిగేషన్ భవనం

మండల కేంద్రం కనగానపల్లిలో రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఇరిగేషన్ (జలవనరుల శాఖ) భవనం నిరుపయోగంగా ఉంది. గతంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం పక్కన రూ.19.8 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. దీనిని నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా.. ఇంతవరకు ఈ భవనాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులు ఉపయోగించ లేదు. దీంతో ఆ భవనం నిరుపయోగంగా మారి, శిథిలావస్థకు చేరుకునే పరిస్థితిలో ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ భవనాన్ని వినియోగించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – కనగానపల్లి:

## క్లుప్తంగా

### పూరి జగన్నాథస్వామికి స్నాన యాత్ర


అలంకరణలో పూరి జగన్నాథస్వామి

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని ఇస్కాన్ మందిరంలో గురువారం పూరి జగన్నాథస్వామికి స్నాన యాత్ర మహోత్సవాన్ని నిర్వహించారు. ఒరిస్సాలోని పూరి క్షేత్రంలో స్నానయాత్ర మహోత్సవం జరుగుతుండటంతో ఇక్కడ స్వామికి ప్రత్యేక పూజలతోపాటు పూరినామ సంకీర్తన, వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. ఇస్కాన్ మందిరం ఇన్‌చార్జ్ కృష్ణమానస్ దాస్ ప్రభుజీ మాట్లాడుతూ జగన్నాథస్వామిని ప్రతి ఒక్కరూ పూజించాలని కోరారు.

### పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ వి.వి.ఎస్.శర్మ, మున్సిపల్ కమిషనర్

**కదిరి టౌన్:** 14 ఏళ్ల పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని కదిరి ఆర్డీఓ వి.వి.ఎస్.శర్మ పేర్కొన్నారు. గురువారం రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక మాసం పోస్టర్‌ను ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓతో పాటు అధికారులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రమాదకర ప్రదేశాల్లో 14 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలతో పని చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బాలలకు పనిచేసే వాతావరణాన్ని కాదని, చదువుకొనే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రెడ్స్ సంస్థ కోఆర్డినేటర్ యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి పైపులైన్ మరమ్మతు


ఆత్మకూరు వద్ద తాగునీటి పైపులైన్ మరమ్మతు చేయిస్తున్న దృశ్యం

**తాడిమర్రి:** మండలంలోని ఆత్మకూరు సమీపంలో ప్రధాన తాగునీటి సరఫరా పైపులైన్ లీకేజీని గురువారం సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు మరమ్మతు చేశారు. పార్నపల్లి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి తాడిమర్రి, శివంపల్లి, ఆత్మకూరు గ్రామాల మీదుగా ధర్మవరం ప్రజలకు తాగునీరు అందించడానికి పైపులైన్ ఏర్పాటు చేశారు. ఆత్మకూరు వద్ద పైపులైను కొంతకాలంగా లేకేజీ అవుతూ తాగునీరు వృథా అవుతోంది. దీంతో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు నియోజక వర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు ధర్మవరం మున్సిపాలిటీలోని డిప్యూటీ ఇంజినీర్ వీరేష్‌తో కలిసి క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం సత్యసాయి కార్మికులతో పైపులైన్ మరమ్మతు చేయించారు.

### మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**నల్లమాడ:** మండలంలోని రెడ్డిపల్లికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్. లక్ష్మీనారాయణ(42) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ కే. సూర్యనారాయణ, రెడ్డిపల్లి సర్పంచ్ ప్రసాద్, నాయకులు యర్ర సూరి, చంద్రశేఖర్ అదేరోజు గ్రామానికి వెళ్లి లక్ష్మీనారాయణ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్య శ్యామలమ్మ ఉన్నారు.

### బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం

**పెనుకొండ:** బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదామని మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి టి. వాసుదేవన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కోర్టు భవనంలో గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశం జరిగింది. ఈసందర్భంగా న్యాయమూర్తి బాల కార్మిక చట్టాలను వివరించారు. 18 ఏళ్లలోపు వున్న బాలలను పనుల్లో పెట్టుకోవడం కాని, విద్యకు దూరం చేయడం, వెట్టి చాకిరీ చేయించడం వంటివి నేరమన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి బొజ్జప్ప, న్యాయవాదులు నాగిరెడ్డి, శ్రీరాములు, సుదర్శన్‌రెడ్డి, కోమల, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

### కేజీబీవీ టైప్ ఫోర్ హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**బత్తలపల్లి:** మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నూతనంగా ప్రారంభమైన కేజీబీవీ టైప్ ఫోర్ హాస్టల్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాలలో 2025-2026 సంవత్సరానికి 9, 10వ తరగతులతో పాటు ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలు అభ్యసించడానికి అవకాశం ఉందన్నారు. జూన్ 30న ప్రవేశాలకు చివరి తేదీగా ప్రకటించారని, వివరాలకు హెచ్‌ఎం, ఎంఈఓను సంప్రదించాలని సూచించారు. తల్లిదండ్రులు లేని అనాథలు, కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,44,000లోపు ఉన్నవారికి ప్రవేశాల్లో ప్రాధాన్యత ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

### ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రామానాయక్



**తనకల్లు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కే. రామానాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న మమతాదేవి నార్పలకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో తలుపులలో పనిచేస్తున్న రామానాయక్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

### మెప్మా జిల్లా కార్యాలయం ప్రారంభం

**పుట్టపర్తి అర్బన్:** సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ట్రస్ట్ భవనంలో మెప్మా జిల్లా కార్యాలయాన్ని గురువారం స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెప్మా సిబ్బంది మహిళాభ్యున్నతికి పాటుపడాలన్నారు. సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఉమ్మడి అనంతపురం మెప్మా పీడీ విశ్వజ్యోతి, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పద్మావతి, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి, మెప్మా అధికారులు భవాని, శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ మేనేజర్ లక్ష్మీదేవమ్మ, సీఎంఎం రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త మాధవి

**కదిరి అర్బన్:** మండలంలోని పట్నం, చిప్పలమడుగు గ్రామాల్లో గురువారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మాధవి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను తెలియజేశారు. అనంతరం భూసార పత్రాలను రైతులకు అందజేశారు. ఒక్కో గ్రామంలో ఇద్దరేసి అభ్యుదయ రైతులకు ఐసీహెచ్-5 విత్తనాలను అందించారు. రైతులకు ప్రభుత్వ పథకాలపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పట్నం సర్పంచ్ చలపతినాయక్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### పాఠశాలల పునః ప్రారంభం


బత్తలపల్లిలో పాఠశాలకు వెళ్తున్న చిన్నారులు

**బత్తలపల్లి:** వేసవి సెలవుల అనంతరం గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే కనిపించింది. ప్రైవేట్ పాఠశాలలు మధ్యాహ్నం వరకు పనిచేశాయి. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలతో పాటు బ్యాగులు, యూనిఫాం కొనుగోలు తల్లిదండ్రులకు భారమవుతోంది.

### నేడు విద్యుత్ అంతరాయం

**ధర్మవరం:** పట్టణంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు వార్డుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్‌శాఖ ఏఈ నాగభూషణం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని ప్రియాంకనగర్, ఎర్రగుంట సర్కిల్, పార్థసారథినగర్ తదితర వార్డుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.